
కథా కౌముది


# అటు ఇటు కానీ..

పద్మావతి దివాకర్ల

రామారావు తన కూతురి పెళ్ళి కుదిరిన సందర్భాన బంధువుల్ని, స్నేహితుల్ని స్వయంగా శుభలేఖలు ఇచ్చి పిలవడానికి ఓ ఆదివారంనాడు విశాఖపట్నం వచ్చాడు. తన బంధువులందరికి శుభలేఖలు ఇచ్చిన తర్వాత, తన ఆప్తమిత్రులిద్దర్నీ కలసి పెళ్ళికి పిలవడానికి బయలుదేరాడు.

రామారావు ఆప్తమిత్రులలో ఒకడైన క్రిష్ణమూర్తి బాగా ధనవంతుడు. అతను చిన్నప్పటినుండి డబ్బులోనే పుట్టి డబ్బులోనే పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రినుండి వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని బాగా అభివృద్ధిపరచి తన హయాంలో మరికొన్ని పరిశ్రమలు కూడా నెలకొల్పాడు. నగరంలో ప్రముఖులైన పారిశ్రామికవేత్తల్లో ఒకడైనాడు. బాగా డబ్బు గడించడంతో పాటు రాజకీయంగా బాగా పలుకుబడి కూడా సంపాదించుకున్నాడు. క్రిష్ణమూర్తి ఉండే బంగళా మంచి పోష్‌ఏరియాలో ఉంది.

ఇంకో స్నేహితుడైన రాజారావు పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. రాజారావు మధ్యతరగతి కన్నా ఓ మెట్టు దిగువున ఉన్నాడు. నగరంలో ఓ మూల విసిరేసినట్లు ఉన్న ప్రాంతంలో ఉంటున్నాడు. చదువు సరిగ్గా అబ్బకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తోడై చదువు సగంలో ఆపేసి ఓ కర్మాగారంలో చిన్న ఉద్యోగంలో కుదురుకున్నాడు. పెద్దగా ఎదుగూ బొదుగూలేని జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. తండ్రి చేసిన అప్పులు తీర్చడంతోపాటు ఇంటి బాధ్యతలన్నీ నెత్తిన పడటంతో ఆర్థికంగా బాగా చితికిపోయాడు రాజారావు. క్రిష్ణమూర్తి, రాజారావు ఇద్దరూ కూడా రామారావుకి బాల్యస్నేహితులు, చిన్నప్పటినుండి కలసి చదువుకున్నారు.

అయితే రామారావు వాళ్ళిద్దరికీ భిన్నంగా మధ్యతరగతికి చెందినవాడు. అటు ఆర్థికంగా బాగా పైమెట్టు మీదున్న క్రిష్ణమూర్తితోను, బాగా చితికిపోయి ఆర్థికంగా అట్టడుగువర్గానికి ప్రతినిధిగా ఉన్న రాజారావుతోను ఒకేసమయంలో స్నేహబంధం నెరపగలుగుతున్నాడు రామారావు.

రామారావు స్కూల్‌టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న మధ్యతరగతికి చెందినవాడు. తండ్రి అప్పచెప్పిన బాధ్యతలన్నీ తీరాక, ఉన్న ఒక్కగానొక్క కూతురికి పెళ్ళిసంబంధాలు చూడగా, చూడగా చివరికి ఈ సంబంధం కుదిరింది. అసలు చాలా సంబంధాలు కట్నాలవద్ద తప్పిపోయాయి. ఇప్పుడు కుదిరిన సంబంధమైనా కట్నంలేదుగానీ, లాంఛనాలు, ఇతరత్రా కలిపి తనకు తలకి మించిన భారమైనా ఒప్పుకోక తప్పలేదు రామారావుకి. మగపెళ్ళివారి కోరిక మేరకు ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు చేస్తానని కూడా ఒప్పుకున్నాడు. ఎందుకంటే కట్నంలేని సంబంధం దొరకడమే గొప్ప! పైగా అబ్బాయి మంచి ఉద్యోగస్తుడు. వాళ్ళ కుటుంబంకూడా మంచి సంప్రదాయమైన కుటుంబం. అందుకే అప్పుచేసైనా సరే కూతుర్ని అత్తవారింటికి పంపాలని నిర్ణయించుకున్నాడు రామారావు.

చాలా రోజులనుండి తన స్నేహితులను కలవడానికి కుదరలేదు రామారావుకి. పెళ్ళికి పిలవటంతో పాటు వాళ్ళతో సరదగా ఓ పూట గడపాలని కూడా రామారావు ఆశ.

ముందుగా ఎవరింటికి వెళదామా అని ఓ క్షణం అలోచించి ముందు క్రిష్ణమూర్తి ఇంటికే వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అతను అలాగనుకోవడానికి కారణం ఉంది. అప్పటికే భోజనాల వేళైంది. క్రిష్ణమూర్తి ఇంట్లో అయితే హాయిగా భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవచ్చు. అదే రాజారావు ఇంటికెళ్తే అతనికి తన రాక ఇబ్బంది కలిగించవచ్చు. అంతేకాక అతని ఇల్లు ఇరుకు కూడాను. అందుకే వెంటనే సెల్ తీసి క్రిష్ణమూర్తికి ఫోన్ చేసాడు. కొద్దిసేపట్లో అతను ఫోన్ ఎత్తగానే, "హల్లో! క్రిష్ణమూర్తి!! నేను రా, రామారావుని. మీ ఇంటికి ఇప్పుడు వస్తున్నాను. మొన్న నీకు చెప్పాను కదా, మా అమ్మాయి పెళ్ళి కుదిరిందని. వచ్చే నెల పదకొండో తారిఖునే పెళ్ళి ముహూర్తం నిశ్చయమైంది. నీకు పెళ్ళి పత్రిక ఇవ్వడానికి వస్తున్నాను! నువ్వింట్లోనే ఉన్నావు కదా? " అన్నాడు రామారావు.

"ఆఁ...నేను ఇంట్లోనే ఉన్నాను, గాని ఇప్పుడే వ్యాపార సంబంధమైన అర్జెంట్ పనొకటి తగిలింది. బయటకి వెళుతున్నాను. నా పని పూర్తవడానికి ఓ రెండుమూడు గంటలు పట్టవచ్చు. మనం కలుసుకోవడం కుదరదేమో? పోనీ ఇంటికొచ్చి శుభలేఖ ఇచ్చివెళ్ళు." అన్నాడు క్రిష్ణమూర్తి.

రామారావు నొచ్చుకొని, "అదేంటిరా! శుభలేఖ ఇవ్వడమని కాదుకానీ, నీతో కొద్దిసేపు గడపాలని కూడా అనుకున్నా రా!" అన్నాడు.

"అయితే నాకిప్పుడు టైం లేదు. ఒక పని చెయ్యి! నువ్వు సాయంకాలం ఐదుగంటలకి రా! మనం తీరుబడిగా కబుర్లు చెప్పుకుందాం." అన్నాడు క్రిష్ణమూర్తి.

"అలాగేలేరా! ఈలోపున నా పని పూర్తిచేసుకు వస్తాను." అంటూ రామారావు ఫోన్ కట్ చేసాడు. 'ఇప్పుడేంటి చేయడం? హోటల్‌కెళ్ళి భోజనం చేసి రాజారావింటికి వెళ్ళడమా లేక ముందు అతనింటికే వెళ్ళి రావడమా?' అనే అలోచనలో పడ్డాడు రామారావు.

బయట హోటల్‌లో భోజనం చేసి రాజారావింటికి వెళ్తే అతను నొచ్చుకుంటాడేమోనన్న భయం. చివరికి రాజారావింటికే వెళ్ళడానికి నిశ్చయించుకొని ఆటో మాట్లాడుకున్నాడు రామారావు.

ఆ ఇరుకుసందులోకి ఆటో వెళ్ళలేకపోవడంతో వీధిమొదలులోనే అపించి రాజారావింటివైపు నడుచుకొని వెళ్ళాడు రామారావు. ఇంట్లో ఉన్నాడో, లేడో అని సందేహిస్తూనే తలుపు తట్టాడు. కొద్దిసేపట్లోనే తలుపు తెరిచి చూసిన రాజారావు రామారావుని చూసి సంభ్రమాశ్చర్యాలకి గురయ్యాడు.

"అరే! ఏంటి, రామారావూ ఈ ఆకస్మిక దర్శనం?" అని రామారావుని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. రాజారావు ఆప్యాయతకి తబ్బిబ్బయ్యాడు రామారావు.

రాజారావు వెంట ఇంట్లోకి నడిచాడు. ఓ రెండు గదులు, ఓ వంటిల్లు ఉన్న చిన్న ఇల్లది. ఓ గదిలో మంచంపైన పడుక్కున్న రాజారావు తండ్రి ఉండుండి దగ్గుతున్నాడు. ముందు గదిలో ఒకేఒక కుర్చీ ఉంది.

"నువ్వు కూర్చోరా!" అంటూ రాజారావు నేలపై చతకిలబడ్డాడు. రామారావు ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్నాడు. ఈ లోపున రాజారావు భార్య సరిత మంచినీళ్ళు పట్టుకొచ్చి రామారావుని పలకరించింది, "అన్నయ్యగారూ! బాగున్నారా? అందరూ కులాశానా! వదినని తీసుకురాలేదేమీ?"

"ఆఁ...కులాసాయే! అమ్మాయి పెళ్ళి పనుల్లో తను మునిగి ఉంది, అందుకే రాలేకపోయింది."అన్నాడు రామారావు మంచినీళ్ళు అందుకుంటూ.

"అమ్మాయి పెళ్ళి కుదిరందని తెలిసి చాలా సంతోషించాము. ఏం చేస్తున్నాడు కాబోయే అల్లుడు?" అని అడిగాడు రాజారావు.

రామారావు వివరాలు చెప్పాడు. అన్నీ విన్న రాజారావు, అతని భార్య సరిత చాలా సంతోషించారు. రామారావు పెళ్ళి శుభలేఖ అందజేసి పెళ్ళికి అందర్నీ రమ్మని మరిమరీ అహ్వానించాడు.

"అన్నయ్యగారూ! కాళ్ళు చేతులు కడుక్కొని రండి, భోజనం చేద్దురు గాని!" అంది సరిత.

"నేను వస్తున్నప్పుడు హోటల్లో భోజనం చేసే వచ్చాను." వాళ్ళని ఇబ్బంది పెట్టలేక అబద్ధం ఆడాడు రామారావు.

"ఊర్కోరా! నువ్వు అబద్ధం చెప్తున్నావని నీ మొహమే చెప్తోంది. పైగా బాగా ఎండలో తిరిగి వచ్చావు. మొహమ్మాటాలేమీ పెట్టుకోకు. మేము నీకు పరాయి వాళ్ళమేమీ కాదు." అన్నాడు రాజారావు.

ఇక తప్పలేదు రామారావుకి. వాళ్ళిద్దరూ కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చేసరికి సరిత స్నేహితులిద్దరికీ భోజనం వడ్డించింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసారు. వాళ్ళ ఆప్యాయతవల్ల అతి సామాన్యంగా ఉన్నా భోజనం చాలా రుచికరంగా అనిపించింది రామారావుకి. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటుంటే వాళ్ళకి సమయమే తెలీలేదు.

"అవునూ! ఏరీ, మీ వాడు శ్రీధర్, మీ అమ్మాయి రమ్య ఎక్కడా కనిపించడంలేదు. ఇంతకీ ఏంటి చేస్తున్నాడు శ్రీధర్? అమ్మాయికేమైనా పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?" అడిగాడు రామారావు.

"అబ్బాయిని చదువు మానిపించేసాను. అంతంత కాలేజీ ఫీస్‌లంటే మాటలా? నా వల్లకాదు భరించడం. నా తాహతుకు మించినదని చదువు మానిపించి మెకానిక్ షెడ్లో పనికి కుదిర్చాను. అలాగే అమ్మాయి కూడా కుట్లు, అల్లికలు నేర్చుకుంది కదా, వీధి చివర టైలర్‌షాపులో పని చేస్తోంది. వాళ్ళిద్దరు చేతికి పూర్తిగా అందివస్తే నాకు కొంచెం ఊరట లభిస్తుంది. డబ్బులు కూడగట్టుకున్నాక అమ్మాయి పెళ్ళి చేయొచ్చునని ఆశ." అన్నాడు రాజారావు.

"అయ్యో! అప్పుడే వాళ్ళిద్దరినీ పనుల్లో పెట్టేసావా? ఎంత వయసు వాళ్ళకని? ఇద్దర్నీ పైచదువులు చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయికదా?" అన్నాడు రామారావు.

"ఎంత చదివినా ఉద్యోగాలు మాలాంటి వాళ్ళకి గగన కుసుమాలే కదా? పైగా కాలేజి చదువులకి వేలకి వేలు కట్టాలి. అయిదు వేలు కాలేజీ ఫీస్. అమ్మో! అంతడబ్బులు భరించడం నావల్ల కాదు. అందుకే పనిలో పెట్టాను. ఏదో ఒక సంపాదన ఉంటే చాలు. వాడి బతుకు వాడు బతుకుతాడు. అలాగే ఏదో గంతకు తగ్గ బొంత నిచ్చి అమ్మాయి పెళ్ళి కూడా చేయలేకపోను." అన్నాడు రాజారావు.

రాజారావుని తండ్రిని ఓ సారి పలకరించాడు రామారావు.

"నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది? మంచి డాక్టర్‌కెవరికైనా చూపించలేకపోయావా?" అన్నాడు రామారావు.

"ఏం చెప్పమంటావురా? ఎంతమంది డాక్టర్లకి చూపించినా అలాగే ఉంది. డబ్బుకి డబ్బు అయిపోతోంది. కాని ఆరోగ్యం నెమ్మదించడం లేదు. నెలకి నాన్నగారి మందులకే ఓ రెండు వేలవుతుంది తెలుసా?" నిస్సహాయంగా అన్నాడు రాజారావు.

అతని పరిస్థితికి జాలిపడ్డాడు రామారావు. అతనికి ఏవిధమైన సహాయం తను చేలేకపోతున్నందుకు కాస్త బాధపడ్డాడు కూడా.

భోజనం తర్వాత కాసేపు కూర్చుని పెళ్ళికి రమ్మని మరీమరీ చెప్పి ఇక వస్తానంటూ బయలుదేరాడు రామారావు. వీధిలోకి వచ్చి టైం చూసుకున్నాడు. నాలుగున్నర అయింది.

క్రిష్ణమూర్తి ఇల్లు అక్కణ్ణుంచి ఓ అరగంటలో వెళిపోవచ్చని, రోడ్డు మీదకి వచ్చి ఆటో ఎక్కాడు రామారావు.

ఆటోలో కూర్చొని మిత్రుడు క్రిష్ణమూర్తికి ఫోన్‌చేసి అతను ఇంట్లోనే ఉన్నాడని నిర్ధారించుకున్నాడు. కిష్ణమూర్తి ఇంటిముందు ఆటో ఆపి దిగాడు రామారావు. అది ఇల్లనడంకంటే భవంతి అని అనడమే సబబు. చాలా విశాలమైన జాగాలో విస్తరించి ఉంది విలాసవంతమైన ఆ భవంతి. ఇంటి ముందు పార్కులాంటి పెద్ద తోట. తను వచ్చినట్లు క్రిష్ణమూర్తికి ఫోన్ చేయగానే వాచ్‌మేన్‌కి కబురు చేసి లోపలికి పంపమన్నాడు.

రామారావు ఇంట్లోకి వెళ్ళాడు. హాల్‌లో సోఫాలో కూర్చొని ఉన్నాడు క్రిష్ణమూర్తి. రామారావు వయసువాడే అయినా సంపద ఇచ్చిన సౌఖ్యం వల్ల రామారావుకన్న పదేళ్ళు చిన్నవాడిలాగానే కనబడతాడు క్రిష్ణమూర్తి. అసలే ఇంద్రభవనంలాంటి ఇల్లు. అందమైన ఇంటీరియర్ డెకరేషన్‌తో సినిమా సెట్‌ని తలపిస్తోంది ఆ హాలు. అక్కడ అణువణువునా ఐశ్వర్యం ఉట్టిపడుతోంది. ఎక్కడెక్కడనుంచో తెచ్చిన పాలరాతి ఫ్లోరింగ్. గోడలమీద అందమైన, ఖరీదైన వర్ణచిత్రాలు అద్భుతంగా అమరాయి. అవన్నీ చూస్తుంటే తను పొరపాటున స్నేహితుడింటికి కాక స్వర్గంలో అడుగుపెట్టానా అని ఒక్కక్షణం కలవరపడ్డాడు రామారావు.

రామారావుని చూడగానే లేచి నిలబడి నవ్వుతూ పలకరించాడు క్రిష్ణమూర్తి, "సారీరా! ఉదయం చాలా అర్జెంట్ పని ఒకటి ఉండేది. అందుకే నిన్ను ఈ సమయంలో రమ్మన్నాను." అన్నాడు.

"సరేరా! ముఖ్యమైన పనులు వదులుకుంటే ఎలా చెప్పు? ఈ లోపున మన రాజారావు లేడూ వాడింటికి వెళ్ళానులే." అన్నాడు రామారావు సోఫాలో కూర్చోబోతూ.

ముట్టుకుంటే మాసిపోయేలా, మెత్తగా ఉన్న ఆ సోఫాలో కూర్చోడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు రామారావు.

"ఓహో!...రాజారావు ఇంటికి వెళ్లావా? ఎలా వెళ్ళగలిగావురా ఆ మురికివాడకి నువ్వు?" అన్నాడు క్రిష్ణమూర్తి కళ్ళెగరేస్తూ.

"ఎంతైనా మన స్నేహితుడురా వాడు!" అన్నాడు రామారావు నొచ్చుకుంటూ.

"నేనైతే అటువైపు వెళ్ళవలసి వస్తే ఉక్కిరిబిక్కిరైపోతాను. ఆ సంగతలా ఉంచు. అమ్మాయి పెళ్ళి ఎప్పుడు? ఏంటి చేస్తున్నాడు కాబోయే అల్లుడు?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"వచ్చేనెల పదకొండో తారీఖేరా! ఇప్పుడే చెపుతున్నా, అర్జెంట్ పనులు, బిజినెస్ పనులు అని రావడం మానేవు సుమీ! తప్పకుండా రావాలి సుమా!" మరీ మరీ చెప్పాడు రామారావు పెళ్ళిపత్రిక క్రిష్ణమూర్తికిస్తూ.

క్రిష్ణమూర్తి కేకేసి భార్య శారదని పిలిచాడు. ఆమె వచ్చి రామారావుని పలకరించి స్నేహితులిద్దరికీ కాఫీ అందించింది. మిత్రులిద్దరూ కబుర్లలో పడ్డారు. క్రిష్ణమూర్తి తన వ్యాపారం గురించి, వాటి అభివృద్ధికి తనెంత కష్టపడుతోంది చెప్పుకుపోతున్నాడు.

"చూసావా! నువ్వు ఇప్పుడు కాఫీ తాగుతున్న కప్పు ఎంత ఖరీదో తెలుసా? ఊహించుకోగలవా?" అనడిగాడు దర్పంగా.

తను తాగుతున్న కాఫీ కప్పు వంక చూసాడు. అందమైన నగిషీలతో నిజంగా చాలా బాగుందది. ఖరీదైనది. అయితే దాని విలువ మాత్రం అంచనా వెయ్యలేకపోయాడు రామారావు. తనకి తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

“ఈ కప్పులు చైనా నుంచి తెప్పించాను. ఒకొక్కటి యాభై వేలు తెలుసా?" అన్నాడు గొప్పగా.

చిన్నప్పటినుండి క్రిష్ణమూర్తి నైజం ఎరిగివున్న మూలాన రామారావు ఆశ్చర్యం నటించి, "అబ్బో!" అన్నాడు.

కాఫీ తాగుతూ మధ్యమధ్యలో గోడకున్న పెయింటింగ్స్ వైపు చూస్తున్న రామారావుని గమనించి అన్నాడు, "ఆ పెయింటింగ్స్ ఎలా ఉన్నాయి? పారిస్ వెళ్ళినప్పుడు కిందటేడాది కొన్నాను, ఒకొక్కటి పదిలక్షలు." అన్నాడు క్రిష్ణమూర్తి.

అబ్బురపోయి మళ్ళీ వాటివంకే చూడసాగాడు రామారావు.

"రా! ఇల్లంతా చూద్దువుగాని!" అని ఆ భవంతి అంతా తిప్పి రామారావుకి చూపించాడు.

"చూసావా, ఈ ఫ్లోరు? ఈ మార్బుల్స్ రాజస్తాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించాను. ఎంతైయిందో తెలుసా! జస్ట్ ఓ రెండు కోట్లు మాత్రమే! అంతే కదా!" ఇలా ఒకొక్కటి చూపించి తను వాటిని ఎక్కణ్ణుంచి ఎలా తెచ్చింది, ఎంత ఖరీదైనది వివరించి చెప్తున్నాడు. క్రిష్ణమూర్తి వైఖరి ముందునుండీ ఎరిగిఉండటం మూలాన రామారావు అంతా మౌనంగా విన్నాడు.

ఇల్లంతా చూసి తిరిగి సోఫాలో కూర్చున్న తర్వాత అడిగాడు రామారావు, "అవునూ, మీ వాడు ఏం చేస్తున్నాడురా?"

"మా వాడా! వాడు అమెరికాలో ఎమ్మెస్ చేస్తున్నాడు. వాడు ఇక్కడికి తిరిగి రాగానే నా బిజినెస్ చూస్తాడు. అంతే కదా మరి! అందుకే ఎంత ఖర్చైనా వెనుకాడక వాడిని అక్కడికి పంపింది." అన్నాడు క్రిష్ణమూర్తి.

రామారావు మనసులో నవ్వుకున్నాడు. తనకోసం, తన స్వార్థంకోసం అమర్చుకున్న ప్రతీవాటిని డబ్బులతో కొలుస్తూ అతిశయం ప్రదర్శిస్తున్నాడు క్రిష్ణమూర్తి. ఏంత డబ్బు ఖర్చైనా వెనకాడక సమకూర్చుకుంటున్నాడు. ఎంత డబ్బైనా లెక్కలేదతనికి! ఆర్థికంగా పైమెట్టుమీద ఉన్నకారణంగా తను సాధించిన ప్రతీదాన్నీ డబ్బులోకే మార్చి చూసుకుని ఆ విధంగా తృప్తి పడుతున్నాడు. గర్వంగా ఫీలవుతున్నాడు. అలాగే పాపం, ఆర్థికంగా కిందమెట్టుపైనున్న రాజారావు తనకి కావలసిన ప్రతీదాన్నీ డబ్బుతో సాధించలేక వదులుకొని ఉన్నాదానితోనే సరిపెట్టుకొని సంతృప్తి చెందుతున్నాడు.

ఎటొచ్చీ తనలాంటి మధ్యతరగతి వాడిదే సమస్యంతా! ఏదైనా తన అందుబాటులో ఉందా, లేదా అన్నది ముఖ్యం కాదు. అందుబాటులో ఉన్నా, లేకున్నా అప్పుచేసిమరీ సమకూర్చుకోవాలి. 'అమ్మో! ఇంతా!' అని రాజారావులా వదలనూలేడు, 'అంతే కదా!' అని క్రిష్ణమూర్తిలా అనుకోనూలేడు. ఓ మధ్యతరగతివాడిగా ఏ నిర్ణయం తీసుకొనే అధికారంకూడా తనకి లేదు. ఎప్పటికప్పుడు పరిస్థితులకి అనుగుణంగా తనని తాను మలచుకోవడం మాత్రమే తను చేయాలి. అదే మరి మధ్యతరగతి మనోభావం!

"ఏంరా! ఏంటి ఆలోచిస్తున్నావు?" అన్న క్రిష్ణమూర్తి మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలో పడ్డాడు రామారావు.

తన ఆలోచనలని పైకి కనపడకుండా పైకి చిరునవ్వు నవ్వి, "సరేరా! ఇక వస్తాను! మీరిద్దరూ అమ్మాయి పెళ్ళికి తప్పకుండా రావాలిసుమా!" అన్నాడు పైకి లేస్తూ.

★★★

Click here to share your comments on this story